క్లుప్తంగా

ఉగాది వేడుకలకు రండి



ఆహ్వానపత్రిక అందిస్తున్న నిర్వాహకులు

ఎల్లారెడ్డిపేట: వెంకటాపూర్ గ్రామ శివారులో ఉగాది పండుగ రోజు నిర్వహించే మహా యజ్ఞానికి హాజరు కావాలని కోరుతూ నిర్వాహకులు గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరికి ఆహ్వాన పత్రికలను అందజేశారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న కృష్ణ

ఎల్లారెడ్డిపేట: బండలింగంపల్లి గ్రామంలో పంచాయతీ అధికారులు గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ.. ఎండాకాలంలో గ్రామస్తులు, ప్రయాణికుల దప్పిక తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఏఎంసీ డైరెక్టర్ జంగ శ్రీకాంత్‌రెడ్డి, జంగ అంజిరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లు తనిఖీ



తనిఖీ చేస్తున్న వైద్యశాఖ అధికారులు

సిరిసిల్లటౌన్: జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.రజిత ఆధ్వర్యంలో డాక్టర్ అంజలినా ఆల్ఫ్రెడ్ పీవోఎం హెచ్ఎన్. పీసీపీఎన్ డీటీ యాక్ట్ స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. డిప్యూటీ డెమో రాజ్‌కుమార్, హెచ్ఈ బాలయ్య, ఎన్జీవో ప్రెసిడెంట్ చింతోజు భాస్కర్ పాల్గొన్నారు.

నిరుపేద ముస్లింలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడ: రంజాన్ పండుగను పురస్కరించుకుని బీజేపీ నాయకులు ప్రతాప రామకృష్ణ 150 మంది నిరుపేద ముస్లిం మహిళలకు గురువారం పార్టీ కార్యాలయంలో దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాపెల్లి శ్రీధర్, రేగుల మల్లికార్జున్, కిష్టస్వామి పాల్గొన్నారు.

భూములకు పరిహారం ఇవ్వండి



వినతిపత్రం ఇస్తున్న రైతులు

కోనరావుపేట: మండలంలోని మల్కపేట ఊర చెరువులో పంటలు మునుగుతున్న రైతులకు పరిహారం ఇవ్వాలని కోరుతూ రైతులు ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతులు మాట్లాడుతూ మల్కపేటలోని ఊరచెరువును కాళేశ్వరం ప్రాజెక్ట్ 9వ ప్యాకేజీ కుడి కాలువ ద్వారా చెరువును నీటితో నింపుతున్నారు. ఈ చెరువులో ఉన్న సుమారు 45 ఎకరాల పట్టా, లావుని పట్టా భూములు మునిగిపోతున్నాయి. ఈ భూమి తప్ప వేరే జీవనోపాధి లేదని, అధికారులతో క్షేత్రస్థాయిలో సర్వే చేయించి పరిహారం అందించాలని కోరారు.

రేపు సదరం శిబిరం

సిరిసిల్లకల్చరల్: ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఈనెల 29న సదరం శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి పర్యవేక్షణాధికారి గురువారం ప్రకటనలో తెలిపారు. వైకల్య నిర్ధారణ అవసరం ఉన్న వారు మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుని సంబంధిత మెడికల్ డాక్యుమెంట్లతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు.

ధాన్యం కొనుగోళ్లు సింగిల్ విండోలకు అప్పగించాలి

తంగళ్లపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్‌విండోలకు అప్పగించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు గురువారం పలువురు సింగిల్‌విండో చైర్మన్లు విన్నవించారు. ఈమేరకు వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సిరిసిల్ల సింగిల్విండో చైర్మన్ బండి దేవదాస్, ఎల్లారెడ్డిపేట కృష్ణారెడ్డి, కోరెం కిషన్‌రెడ్డి, ఇల్లంతకుంట తిరుపతిరెడ్డి, పెద్దూర్ కిషన్‌యాదవ్ ఉన్నారు.

మండువేసవిలో జలసవ్వడులు





మండువేసవిలో మానేరు ఏరియాలో గోదావరి జల సవ్వడులు వినిపిస్తున్నాయి. ఎస్సారెస్పీ ద్వారా మల్లన్నసాగర్ కెనాల్‌తో ముస్తాబాద్ మండలంలోని పలు చెరువులకు నీరు అందుతోంది. ఓ వైపు మండలంలో కొన్ని గ్రామాల్లో నీరు లేక పొలాలు ఎండిపోతుండగా.. చీకోడు, మద్దికుంట, నామాపూర్, గూడెం గ్రామాల్లోని చెరువులకు గోదావరి జలాలు వస్తున్నాయి. మండుతున్న ఎండలు ఒకవైపు.. నిండుగా నీటితో పారుతున్న కాలువలు మరోవైపు ముస్తాబాద్ మండలంలో కనిపిస్తున్నాయి. పంటలకు ప్రాణం పోయడంతోపాటు మూగజీవాల దాహార్తిని తీర్చుతున్నాయి. మల్లన్నసాగర్ కెనాల్ పరివాహక గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. – ముస్తాబాద్

ఎందుకింత నిర్లక్ష్యం?

- తాళం వేసి.. చెవి అక్కడే పెట్టి !



చందుర్తి: మండలంలోని బండపల్లి రైతువేదిక నిర్వహణపై వ్యవసాయాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రైతువేదిక కార్యాలయానికి తాళం వేసి, దాని తాళం చెవులు(కీస్) గొళ్లానికి పెట్టి వెళ్లడంపై మతలబు ఏమిటోనని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. అసలే ఊరి చివర ఉన్న వేదికకు రాత్రిపూట తాళం ఉంచడంపై వాటిలో ఉన్న సామగ్రి భద్రమేనా అన్న సందేహాలను గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో గన్నీసంచుల వినియోగానికి తాళం చెవి ఇవ్వమని కోరితే నిరాకరించే అధికారులు రాత్రిపూట తాళం చెవిని ఎందుకు పెట్టి వెళ్లారన్న చర్చ స్థానికంగా కొనసాగుతోంది. దీనిపై చందుర్తి వ్యవసాయాధికారిణి అనూషను వివరణ కోరగా, విషయం తెలుసుకొని చెబుతానని తెలిపారు.

మురుగు సమస్య తీరేదెన్నడు?



రోడ్డుపై పారుతున్న మురుగు

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్‌లో కొన్ని నెలలుగా పారిశుధ్యంపై పట్టింపు కరువైంది. గ్రామం నుంచి కోనరావుపేట మండల కేంద్రానికి వెళ్లే రోడ్డుపై ఇళ్లలోని మురుగునీరు రోడ్డుపైనే పారుతోంది. మండలంలోని మామిడిపల్లి, కనగర్తి, సుద్దాల, మంగళ్లపల్లి, పల్లిమక్త గ్రామాల ప్రజలు ఈ దారిగుండానే మండలకేంద్రమైన కోనరావుపేటకు వెళ్తుంటారు. ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలు ఎక్కువగానే ఉంటాయి. రోడ్డుపై మురుగు నీరు పారడతంతో వాహనదారులతో పాటు స్థానికులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మానవ అక్రమ రవాణా నివారణకు కృషిచేయాలి



మాట్లాడుతున్న ఏపీఎం మల్లేశం

ఎల్లారెడ్డిపేట: మానవ అక్రమ రవాణా నివారణ, లైంగిక వ్యాపారం, సైబర్ ఆధారిత అక్రమ రవాణా లాంటి వాటిపై స్వయం సహాయక సంఘాల సభ్యులు అప్రమత్తంగా ఉండాలని ఏపీఎం మల్లేశం అన్నారు. మండల కేంద్రంలోని కావేరి మండల సమాఖ్య కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల మహిళలతో గురువారం సమావేశం నిర్వహించారు. మానవ అక్రమ రవాణాపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు బైరి జ్యోతి, సీసీలు నాయక్, దేవేందర్, నాగరాజు, సుధాకర్, రమణ, పద్మ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నర్సక్కపేటలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఇల్లంతకుంట: మండలంలోని నర్సక్కపేటలో ఎన్ఆర్ఈజీఎస్ రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. బీజేపీ మండలాధ్యక్షుడు భూమల్ల అనిల్‌కుమార్, దూది సుధీర్‌రెడ్డి, బొల్ల రామ్‌రెడ్డి, ఏలేటి మాధవరెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లంతకుంట: రాజ్యాంగాన్ని అవమానించడమే బీజేపీ లక్ష్యంగా పనిచేస్తుందని మండల ఇన్‌చార్జి సూర్య దేవరాజు విమర్శించారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాఘవరెడ్డి, నాయకులు పసుల వెంకటి, అంతగిరి వినయ్‌కుమార్, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఎలగందుల ప్రసాద్, నాయకులు ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, అల్లెపు రజనీకాంత్, ఎండీ జమాల్, మచ్చ రాజేశం, వీరేశం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

- పరిస్థితి విషమం
- హైదరాబాద్‌కు తరలింపు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఆరేపల్లికి చెందిన గొల్ల చిన్న గంగయ్య కొంతకాలంగా రాచర్లబొప్పాపూర్‌కు చెందిన బర్రవేణి కొండయ్య వద్ద గొర్రెల కాపరీగా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి సెలూన్‌లో క్షవరం చేయించుకొని ఇంటికి తిరిగి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన బిస్క సత్యం బైక్‌తో అతివేగంగా ఢీకొట్టాడు. నడుచుకుంటూ వెళ్తున్న చిన్నగంగయ్య తీవ్రంగా గాయపడగా ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. గంగయ్య బావ మరిది కర్రోళ్ల మల్లేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శిక్షణసంస్థల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: రానున్న ఆర్థిక సంవత్సరానికి శిక్షణ, ఉపాధి, ప్లేస్‌మెంట్స్ కోసం శిక్షణ భాగస్వాముల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ అభివృద్ధి అధికారి తెలిపారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థ, టాస్క్, ఈజీఎంఎం, మెప్మా, ఎంఎస్ఎంఈ గుర్తింపు పొందిన లేదా అనుసంధానమైన వృత్తి శిక్షణ సంస్థలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఎంపికైన శిక్షణ భాగస్వాములు రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీస్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌తో ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉంటుందన్నారు. విద్యార్థుల సమీకరణ, శిక్షణ బాధ్యతలు తీసుకునే సంస్థలు జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయం ద్వారా ధ్రువీకరించబడతాయన్నారు. పూర్తి వివరాల ప్రతిపాదనల రెండు సెట్ల హార్డ్‌కాపీలను రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ కార్యాలయానికి ఈనెల 31లోపు పంపించాలని సూచించారు. వివరాలకు 99499 10328లో సంప్రదించాలని కోరారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు



ఎల్లారెడ్డిపేట ఠాణాలో మాజీ సర్పంచులు



తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ వద్ద మాజీ సర్పంచులు



ముస్తాబాద్ ఠాణాలో మాజీ సర్పంచులు

- చలో అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డగింత

ఎల్లారెడ్డిపేట: గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల మంజూరు చేయాలని కోరుతూ మాజీ సర్పంచులు చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి బయలుదేరిన ఎల్లారెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పచులను ముందస్తుగా గురువారం తెల్లవారుజాము నుంచే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు మాట్లాడుతూ ప్రభుత్వం బిల్లుల కోసం పోరాడుతున్న మాజీ సర్పంచులను అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. అరెస్టులు చేయడం కాదు.. గ్రామాల్లో అభివృద్ధి చేసి అప్పులపాలు అయ్యామని.. వెంటనే బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల అదుపులో మాజీ సర్పంచులు కోల నర్సయ్య, ప్రభునాయక్, అజ్మీర తిరుపతినాయక్, రాజునాయక్, పుణ్యానాయక్ తదితరులు ఉన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలంలోని మాజీ సర్పంచులను గురువారం ఉదయం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాట్ల మధు, జిల్లా జేఏసీ ప్రధాన కార్యదర్శి గణప శివజ్యోతి, మాజీ సర్పంచులు కొయ్యడ రమేశ్, సురభి సరిత నవీన్‌రావులను పోలీసులు స్థానిక ఠాణాకు తరలించారు. అరెస్టయిన మాజీ సర్పంచులకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, మాజీ ఎంపీటీసీ కోడి అంతయ్య సంఘీభావం తెలిపారు.

ముస్తాబాద్: చలో అసెంబ్లీకి తరలివెళ్తారని మండలంలోని మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. మాజీ సర్పంచ్‌లు చాకలి రమేశ్, అగ్రహారం లక్ష్మణ్, తాడెపు ఎల్లంలను అదుపులోకి తీసుకున్నారు.

సంక్షిప్త వార్తలు

● శతక సాహిత్యంపై అవగాహన

గంభీరావుపేట: గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం శతక సాహిత్యం, వ్యక్తిత్వ వికాస అంశాలపై సదస్సు నిర్వహించారు. సాహిత్యంలో శతక సాహిత్యానికి ఉన్న ప్రత్యేకతలు వివరించారు. అధ్యాపకులు పిట్ల దాసు, దీపిక, భార్గవి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ ప్రభాకర్, పీవో పాక ధర్మపురి, వాణి పాల్గొన్నారు.

● జిల్లా మహిళా మోర్చా కార్యదర్శిగా సంగీత

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన బుర్క సంగీత బీజేపీ జిల్లా మహిళా మోర్చా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ గురువారం నియామకపత్రం అందజేశారు.

● వేతనాలు చెల్లించాలని వినతి

వేములవాడరూరల్: వేతనాలు చెల్లించాలని కోరుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు వేములవాడరూరల్ ఎంపీడీవో శ్రీనివాస్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు రెండు నెలల నుంచి రావడం లేదని, కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. రమణ, వెంకటేష్, నవీన్, రమేశ్ ఉన్నారు.

● దొంగకు ఏడాది జైలు

ఇల్లంతకుంట: మోటార్ వైండింగ్ షాపు నుంచి వైరు దొంగిలించిన వ్యక్తికి సిరిసిల్ల ద్వితీయ శ్రేణి కోర్టు న్యాయమూర్తి గడ్డ మేఘన ఏడాది జైలు విధించారని గురువారం ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ముస్కాన్‌పేటకు చెందిన గుర్రం సుధాకర్‌రెడ్డి తన విద్యుత్ మోటార్‌ను రిపేరు కోసం మండల కేంద్రంలోని వేణుగోపాలాచారి షాపులో పెట్టాడు. మోటార్ వైరును వంతడుపులకు చెందిన గొట్టిముక్కల కనకయ్య దొంగిలించాడు. కేసు నమోదు చేసి కోర్టులో దాఖలు చేయగా.. ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించాని ఎస్సై వివరించారు.

● కంప్యూటర్ ల్యాబ్‌కు ఫర్నీచర్ వితరణ

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌కు పూర్వ విద్యార్థి జుకూరి శ్రీనివాస్ రూ.20వేల విలువైన ఫర్నీచర్‌ను గురువారం అందజేశారని ప్రధానోపాధ్యాయుడు రాధాకిషన్‌రావు తెలిపారు. శ్రీనివాస్ టీ ఫైబర్ ప్రాజెక్టులో తెలంగాణ హెడ్‌గా పనిచేస్తున్నారు.

● బోయినపల్లిలో బీడీ కార్మికుల ధర్నా

బోయినపల్లి: బీడీ కార్మికులకు రూ. 4వేల పింఛన్ ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. తహసీల్దార్ ఆఫీస్ ఎదుట గురువారం బీడీ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. గృహిణులకు రూ.2500 పింఛన్ ఇవ్వడంతోపాటు సిలిండర్ గ్యాస్ సబ్సిడీ అందించాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందించారు. గురజాల శ్రీధర్, జవ్వాజి విమల, పూరం పద్మ, రామంచ అశోక్ ఉన్నారు.

● ఆర్మీకి ఎంపిక

కోనరావుపేట: మండలంలోని కొండాపూర్‌కు చెందిన పోశవేణి అభినయ్ ఇండియన్ ఆర్మీకి ఎంపికయ్యాడు. పోశవేణి ఎల్లయ్య–జ్యోతి దంపతుల కుమారుడు అభినయ్ హైదరాబాద్‌లో డిగ్రీ సెకండియర్ చదువుతున్నాడు. ఉద్యోగ ప్రయత్నంలో గురువారం వెలువడిన ఫలితాల్లో ఆర్మీకి ఎంపికయ్యాడు. అభినయ్ తండ్రి గల్ఫ్ బాధితుడు కాగా అనారోగ్య కారణాలతో ఒక కాలు తీసివేశారు. తల్లి జ్యోతి వ్యవసాయ పనులకు వెళ్తోంది.

● ఫోక్ సాంగ్ డ్యాన్సర్లపై దాడి.. కేసు

చందుర్తి: మండలంలోని నర్సింగపూర్‌లో బుధవారం రాత్రి ఫోక్‌సాంగ్ డ్యాన్సర్‌పై దాడి జరిగింది. ఈ సంఘటన సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానికులు తెలిపిన వివరాలు. నర్సింగాపూర్‌లోని తెలిసిన వారి ఇంటికి బుధవారం రాత్రి ఫోక్‌సాంగ్ డ్యాన్సర్ల బృందం వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన నక్క గంగాధర్, శ్రీనివాస్ అక్కడికి చేరుకొని వీరంగం సృష్టించారు. భరించలేక వారు డయల్ 100కు కాల్ చేయడంతో సమస్య సద్దుమణిగింది. కానీ రాత్రి జరిగిన సంఘటన గురువారం ఉదయం గ్రామంలో చర్చకు దారితీసింది. ఈ వివాదం ఠాణాకు చేరగా స్థానిక రాజకీయ నాయకుడి ప్రమేయంతో బయటనే మాట్లాడుకున్నారు. అయితే ఆ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయింది. దీనిపై స్పందించిన పోలీసులు జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లికి చెందిన ఫోక్ సాంగ్ ట్రూప్ నిర్వాహకుడు గుగ్గిళ్ల జగదీశ్ ఫిర్యాదుతో నర్సింగపూర్‌కు చెందిన నక్క గంగాధర్, శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

హార్వెస్టర్ యజమానులు, ఆపరేటర్లతో సమావేశం



ఇల్లంతకుంట: తహసీల్ కార్యాలయంలో హార్వెస్టర్ల యజమానులు, ఆపరేటర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ ఎంఏ ఫరూక్ మాట్లాడుతూ.. వరి పైరు ఎండిన తర్వాతే కోయాలని సూచించారు. ఎంపీడీవో శశికళ, మండల వ్యవసాయ అధికారి సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: చేతికొచ్చిన వరి పంటను కోసేందుకు రైతులు వ్యవసాయ అధికారుల నుంచి అనుమతి(టోకెన్) తీసుకోవాలని, అనుమతులు పొందిన అనంతరం మాత్రమే పంటను కోయాలని తహసీల్దార్ జయంత్‌కుమార్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏఈవోలు, హార్వెస్టర్ యజమానులతో ఏర్పాటు చేసిన మండలస్థాయి సమావేశంలో మాట్లాడారు. ఎంపీడీవో కె.లక్ష్మీనారాయణ, వ్యవసాయాధికారి కనవేని సంజీవ్ పాల్గొన్నారు.

చందుర్తి/వీర్నపల్లి: తేమశాతం తగ్గితేనే వరికోతలు కోయాలని చందుర్తి తహసీల్దార్ శ్రీనివాస్ హార్వెస్టర్ యజమానులను కోరారు. మండలంలోని అన్ని గ్రామాల హార్వెస్టర్ యజమానులతో చందుర్తి రైతువేదికలో గురువారం సమావేశమయ్యారు. తహసీల్దార్ శ్రీని వాస్ మాట్లాడుతూ పంట కోత సమయంలో తేమ ఎలా ఉందని పరిశీలించాకే కోయాలని సూచించారు. మండల వ్యవసాయాధికారిణి అనూష, ఏఈవోలు పాల్గొన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో తహసీల్దార్ ముక్తార్ పాషా స్థానిక హార్వెస్టర్ల యజమానులతో సమావేశమయ్యారు. వరి కోతలపై అవగాహన కల్పించారు.

ఇరుకు వంతెనతో ఇబ్బందులు



నిమ్మపల్లి శివారులో ఇరుకుగా మారిన వంతెన

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లి శివారులో ఉన్న వంతెన ఇరుకుగా మారడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కోనరావుపేట మండలం నిమ్మపల్లి నుంచి మరిమడ్లకు వెళ్లే దారిలో మూలవాగు ప్రాజెక్ట్ సమీపంలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన వంతెన చిన్నగా మారింది. వంతెన నిర్మించిన సమయంలో సింగిల్‌రోడ్డు ఉండేది. ప్రస్తుతం ఈ రోడ్డు డబుల్ రోడ్డు కావడంతో వాహనాల రాకపోకల సంఖ్య పెరిగింది. వంతెన వద్ద బస్సు వస్తే బైక్ కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి వంతెన విస్తీర్ణం పెంచాలని కోరుతున్నారు.

తైబజార్, షాపింగ్ కాంప్లెక్స్‌కు వేలం పాట



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని తైబజార్, పంచాయతీ దుకాణాల గదులకు గురువారం పంచాయతీ అధికారులు వేలం పాట నిర్వహించారు. తైబజార్‌ను రూ.5.11లక్షలకు ఏడాది కాలానికి గాను జవ్వాజి రామస్వామి దక్కించుకున్నారు. సాయిబాబా కమాన్ ప్రాంతంలోని పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన 16 దుకాణాలకు వేలం నిర్వహించగా.. ఒక్కో దుకాణానికి నెలకు రూ.1,050 చొప్పున నిర్ణయించారు. 10 దుకాణాలను పలువురు కిరాయికి తీసుకున్నారు. ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో జోగం రాజు, ఏవో ప్రవీణ్ కుమార్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప బృందం



వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో వైద్య బృందం

వేములవాడరూరల్: వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని ఘనపూర్ ఆసుపత్రికి చెందిన డా.సంధ్య ఆధ్వర్యంలో కాయకల్ప బృందం గురువారం సందర్శించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలు, ఆసుపత్రి పరిశుభ్రతపై అడిగి తెలుసుకున్నారు. మూడు సంవత్సరాలుగా ఆసుపత్రి రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి పొందుతోందని, ఈసారి కూడా అదే స్థాయిలో మార్కులు వస్తాయని ఆశిస్తున్నట్లు ఆసుపత్రి పర్యవేక్షకుడు పెంచలయ్య వెల్లడించారు. వైద్యులు రవీందర్, అనిల్, చారి, సుభాషిణి, నర్సింగ్, సూపరింటెండెంట్లు అంజమ్మ, సుందరి, విజ య, లక్ష్మి, సంజీత, బ్లోసమ్, ఝాన్సీ, సిబ్బంది పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ దరఖాస్తులకు గడువు పెంపు

సిరిసిల్లకల్చరల్: పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తుల గడువును మరోసారి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2024–25 విద్యా సంవత్సరానికి రెన్యూవల్ విద్యార్థులు 7,012 మందికి 6,136 మంది మాత్రమే దరఖాస్తు చేశారు. ఫ్రెష్ విద్యార్థులు 4,948 మంది ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు తమ స్కాలర్‌షిప్ దరఖాస్తులను ఈపాస్ వెబ్‌సైట్‌లో మే 31లోపు రిజిస్టర్ చేసుకునేందుకు గడువు పెంచింది. చివరి గడువుగా భావించి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బెటర్ రిలేషన్..హెల్తీ నేషన్

- ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు నాగమల్ల శ్రీనివాస్

వేములవాడ: బెటర్ రిలేషన్‌షిప్..హెల్తీ నేషన్ కోసం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఐఎంఏ ఆర్‌పీఎల్ పేరుతో ఈనెల 31 నుంచి ఏప్రిల్ 6 వరకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ నాగమల్ల శ్రీనివాస్ గురువారం తెలిపారు. జిల్లాలోని వైద్యులు, పోలీసుశాఖ, జర్నలిస్టులు, అడ్వకేట్లు, టీచర్లు, రెవెన్యూ ఉద్యోగులు ఆరుజట్లుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వేములవాడలోని బైపాస్ రోడ్డులోని బాలానగర్ కోర్టు పక్కన ఖాళీ స్థలంలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అసభ్యకరమైన పోస్టు పెట్టిన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట: బీఆర్ఎస్‌కు చెందిన ఒక నాయకుడు వివిధ పార్టీలకు చెందిన నాయకులపై సోషల్‌మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టినందుకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ గురువారం రాత్రి తెలిపారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన అల్లం శ్రీకాంత్ హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై అసభ్యకర పోస్టులను వాట్సాప్ గ్రూపులలో పోస్ట్ చేశాడు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి చందుపట్ల లక్ష్మారెడ్డి ఫిర్యాదుతో అల్లం శ్రీకాంత్‌పై కేసు నమోదు చేశారు.